

ఆబ్కారీ ఆదాయం రూ.165.72 కోట్లు

- 227 దుకాణాలకు 5,524 దరఖాస్తులు
- గతం కంటే 36 శాతం అదనం
- ముగిసిన మద్యం టెండర్లు



వనపర్తిలో మద్యం దుకాణాలకు దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అర్హులకు విత్తనాలు పంపిణీ చేయాలి

- జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

6

చదువుతోపాటు ప్రభుత్వ సేవలు తెలుసుకోవాలి

- జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

6

ఎట్టకేలకు..!

పదేళ్ల తరువాత రాయితీపై వ్యవసాయ పరికరాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పథకం అమలు
- వనపర్తి జిల్లాకు మంజూరైన రూ.77 లక్షలు
- పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



రైతులకు అందించనున్న వ్యవసాయ పరికరాలు

వనపర్తి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇప్పటికే అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 542 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం రూ.77 లక్షలు మంజూరు చేసింది. దరఖాస్తు చేసుకున్న రైతులకు జిల్లా వ్యవసాయ అధికారులు మండల వారీగా నిధులు కేటాయించారు.

జిల్లాలో 542 దరఖాస్తులు

వనపర్తి జిల్లాలో 15 మండలాలు ఉండగా 542 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అర్హులను గుర్తించి యంత్ర పరికరాలు అందించేందుకు ప్రభుత్వం రూ.77 లక్షలు మంజూరు చేసింది. రైతులకు 50శాతం రాయితీపై యంత్ర పరికరాలను పంపిణీ చేయనుంది. ఆయా యంత్రాలు పరికరాలకు కంపెనీలు ఇచ్చిన ధరల్లో ప్రభుత్వ చెల్లించే సబ్సిడీ పోను మిగిలిన సొమ్ము రైతులు డీడీల రూపంలో చెల్లించాలి. రైతులు నచ్చిన కంపెనీ యంత్రాన్ని పొందే వెసులుబాటు కల్పించారు. స్ప్రేయర్లు, కల్టివేటర్లు, కేజీ వీల్స్, డ్రోన్స్, రోటవేటర్లు, బోదేలు తీసేవి, షాప్ కట్టర్లు, విత్తన గొర్రు, గడ్డి చుట్టే యంత్రం, బ్రష్ కట్టర్, తదితర పరికరాలకు దరఖాస్తు చేసుకున్నారు.

మండలాల వారీగా ఇలా..

వనపర్తి జిల్లాలో 15 మండలాల్లో వనపర్తి 23, గోపాల్‌పేట 47, రేవల్లి 36, పెద్దమందడి 70, ఘణపూర్ 67, అమరచింత 65, ఆత్మకూరు 15, మదనాపూర్ 56, కొత్తకోట 46, పాన్‌గల్ 12, పెబ్బేరు 10, శ్రీరంగాపూర్ 17, వీపనగండ్ల 20, చిన్నంబావి 16, ఏదుల 42 ఇలా మొత్తం వివిధ పరికరాల కోసం 542 దరఖాస్తులు వచ్చాయి.

సబ్సిడీపై పరికరాలు



వ్యవసాయ పరికరాల కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.77 లక్షలు మంజూరు చేసింది. మండలాల వారీగా నిధులు కేటాయించాం. అర్హులైన రైతులకు పరికరాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

- ఆంజనేయులు గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రభుత్వ భూమిని కాజేశారు

అక్రమార్కుల చేతిలోకి దాదాపు రూ.3 కోట్ల విలువైన స్థలం

- గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పక్కనే ఖాళీస్థలం కబ్జా
- హక్కుపత్రం లేకపోయినా భూ బదలాయింపు
- ప్రజాప్రతినిధి అండతో పనులు పూర్తి
- అధికారులు స్పందించాలంటున్న పట్టణ ప్రజలు





అక్రమార్కులు కన్నేసిన గద్వాల-కర్నూల్ రోడ్డుకు ఆనుకొని ఉన్న నిర్మితి కేంద్రం స్థలం

గద్వాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) గద్వాల జిల్లా ఏర్పాటు తర్వాత భూములకు డిమాండ్ పెరిగింది. అందులో కలెక్టరేట్ నుంచి వీరాపురం వరకు కర్నూల్ రోడ్‌కు ఒక ప్లాట్ విలువ రూ.కోట్లల్లో పలుకుతోంది. ఇంకేముందు ఒక ప్లాట్ కాజేసినా కోట్లల్లో లాభం పొందవచ్చని భావించాడొక నాయకుడు. తన భాగస్వామ్యంలో గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో వేసిన వెంచర్‌లో ఓ ప్లాట్లను ఎల్ఆర్ఎస్ చేయించుకొని వారి పేరుమీద మార్చుకునే క్రమంలో ఆ ప్లాటు పక్కనే ఉన్న ఖాళీస్థలంపై ఆయన కన్ను పడింది. ఓ ప్రజా ప్రతినిధి అండతో మునిసిపాలిటీలో చకచక భవన నిర్మాణ అనుమతులు పొంది దాని ముసుగులో ప్రభుత్వ స్థలంలోని వెయ్యి గజాల స్థలం కూడా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ప్రస్తుతం దాని విలువ రూ3కోట్ల పైనే ఉంటుంది.

జములమ్మ కరకట్ట నిర్మాణం కోసం..

గద్వాల పట్టణం సమీపంలో 1986లో జములమ్మ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ఆలయం చుట్టూ కరకట్టను నిర్మించారు. దీని నిర్మాణానికి మట్టి అవసరం కాగా ఇరిగేషన్ అధికారులు అప్పట్లో సర్వే నెంబరు 49లో రెండు ఎకరాల భూమిని తీసుకున్నారు. ఇందుకు గాను పట్టాదారులకు పరిహారం చెల్లించించి మట్టిని తీసుకున్నారు. అదే విధంగా దాని పక్కనే ఉన్న సర్వేనెంబరు 48లో గద్వాల-కర్నూల్ రోడ్ విస్తరణలో భాగంగా మరో 25గుంటల భూమిని సేకరించారు. మరో 3 గుంటల భూమి ఎండోమెంట్ పేరుపై ఉంది. ఇక్కడి వరకు బాగానే ఉంది. పట్టణం విస్తరించి అభివృద్ధి చెందడంతో అందరి కళ్లు ఖాళీగా ఉన్న ఆ ప్రభుత్వ భూమిపై పడింది. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సమయంలో దానిని నిర్మిత కేంద్రంగా ఉపయోగించుకుంది. అప్పట్లో రోడ్డు పక్కనే మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి దానిని హౌసింగ్ కార్యాలయంగా వినియోగించుకున్నారు. ఇప్పుడు ఆ స్థలం ఖాళీగా ఉండటంతో అందులో కొంత భాగం ఎక్సైజ్ కార్యాలయానికి, మరి కొంత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నిర్మాణానికి ఉపయోగించారు. ఇంకా కొంత మిగులు భూమి ఉంది. ఇప్పుడు అందరికళ్లు ఆ భూమిపై పడ్డాయి.

భార్య పేరుపై రిజిస్ట్రేషన్

ఈ ప్రభుత్వ భూమి పక్కనే కొందరు వ్యక్తులు వెంచర్ వేశారు. దీనికి అనుమతి లేదని సమాచారం. అయితే ఈ ప్లాట్లన్నీ దాదాపు అమ్ముడు పోయాయి. మిగిలి పోయిన ప్లాట్లను వెంచర్ వేసిన యజమానులు పంచుకున్నారు. వీటిని తిరిగి వారిపై రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో అందులోని ఒకరి కన్ను వెంచర్ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై పడింది. వెంచర్‌లో మిగిలిపోయిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో ఈ ప్రభుత్వ భూమిలోని 1000గజాల భూమిని కూడా 2023లో భార్య పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. దీని విలువ రూ.3 కోట్లకు పైగానే ఉంటుంది. ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే అంతకు ముందే 2021లో గద్వాల మునిసిపాలిటీలో వీటిపై బిల్డింగ్ అనుమతులు తీసుకున్నారు. ఈ పత్రాలు కూడా సృష్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సర్వే నెంబరు 48,49లోని ప్రభుత్వ భూమికి సంబంధించి డాక్యుమెంట్ లేకుండా ఎలా అనుమతి ఇస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విలువైన భూములను అక్రమార్కులు ఆక్రమిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వదిలేయడం పట్ల గద్వాల ప్రజలు అగ్రహంగా ఉన్నారు. అధికారులు స్పందించి దీనిపై విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి
- కలెక్టర్‌తో కలిసి ఆశ్రమ పాఠశాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వంటశాల తదితర విభాగాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తరగతి గదుల్లోని విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన వసతులను ప్రభుత్వం సమకూరుస్తోంది. మీరు కష్టపడి చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేశారు.

అనంతరం కలెక్టర్ కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. భూభారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు అవసరమైన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి యాదమ్మ, తహసీల్దార్ ఇబ్రహీం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలంపూరు ఆలయాల హుండీ లెక్కింపు

- సమకూరిన రూ.60 లక్షల ఆదాయం




హుండీలోని నగదును లెక్కిస్తున్న స్వచ్ఛంద సేవకులు

అలంపూరు,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాల హుండీ లెక్కింపులో రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చింది. ఉమ్మడి జిల్లా సహాయకమిషనర్ మదనేశ్వరరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు ప్రక్రియ గురువారం జరిగింది. మూడు నెలలకు సంబంధించిన అమ్మవారి హుండీ ద్వారా రూ.50.76లక్షల ఆదాయం రాగా, స్వామి వారి ఆదాయం రూ. 9.97లక్షల మేర సమకూరింది. అన్నదాన సత్రానికి రూ. 5,248లతో మొత్తం రూ.60.78 లక్షల ఆదాయం చేకూరిందని ఈవో దీప్తి తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ మాజీ ఛైర్మన్ కృష్ణయ్య, యూనియన్ బ్యాంకు మేనేజర్ రవికుమార్, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ రేణుకాలక్ష్మి, చెన్నిపాడు గ్రామం నుంచి లక్ష్మీనారాయణ, జి. వెంకటేష్, కురుమన్న, బుడిదపాడు రాజశేఖర్, మానవపాడు మురళీలు స్వచ్ఛంద సేవకులుగా పాల్గొన్నారు.

స్వర్ణాభరణ భూషితుడు.. కురుమూర్తి రాయుడు

- బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టం
- 26న అలంకార ఉత్సవం



కురుమూర్తి స్వామి మూలవిరాట్

6

పోలీసు అమరవీరుల త్యాగాలు

చిరస్మరణీయం

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్
- జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తులతో ర్యాలీలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీస్ సిబ్బంది కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వ హించి వారి ఆత్మకు శాంతి చేకూరే విధంగా ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోలీసులు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నేముల వెంకటేశ్వర్లు, డీఎస్పీలు బుర్రి శ్రీనివాస్ యాదవ్, వెంకట్‌రెడ్డి, సీఐలు అశోక్‌రెడ్డి, మహేష్, శంకర్‌నాయక్, నాగార్జున, నాగరాజు, ఆర్ఎస్ఐ గౌస్‌పాషా, ప్రశాంత్, శివాజీ, ఎస్ఐలు గోవర్ధన్, గురుస్వామి, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షల మంది విద్యార్థులు



వనపర్తి జిల్లాలోని చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల

7

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

- టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం

7

గ్రామాలపై అవగాహన ఉండాలి



జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

కొత్తకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామాలపై ఎస్ఐలకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాలోని ఎస్ఐ లతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ప్రతీ పోలీసు బాధ్యత అన్నారు. దాడులకు గురవుతున్న బాధితులకు న్యాయం జరిగే విధంగా పని చేసి ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలన్నారు. గ్రామాల్లో జరిగే సమస్యలపై ముందస్తు సమాచార సేకరణపై దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, దొంగల కదిలికలపై నిఘా ఉంచాలన్నారు. రాత్రివేళ రోడ్లపై అనవసరంగా తిరిగే వారిని అదుపులోకి తీసుకోని విచారించి మరోసారి కనబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటేశ్వర్‌రావు, ఉమామహేశ్వర్‌రావు, సీఐలు రాంబాబు, కృష్ణయ్య, శివకుమార్, నరేశ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి నరకయాతన

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం
- మరమ్మతు చేపట్టాలంటున్న వాహనదారులు



గుంతలమయంగా జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారి

7

మిత్రుడికుటుంబానికి రూ.లక్ష సాయం



మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

వెల్దండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వెల్దండ మాజీ ఉపసర్పంచ్ చిమ్ముల శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి అతని చిన్ననాటి స్నేహితులు బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా 1991-92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి స్నేహితులు తమవంతుగా రూ.1.2లక్షల నగదు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. తోటి మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని, అతని కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో దామోదర్, నాగేశ్వర్ గౌడ్, జంగారెడ్డి, లక్ష్మి, వనజాత, గిరిజ, హలీం, జగన్, రవీందర్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మణ్, దూంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



శ్రీశైలం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

తెలకపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీశైలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం తోటి ఆర్టీసీ కార్మికులు 90,500 రూపాయలు జమ చేసి బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మాలధారణ



ఉమామహేశ్వరంలో హనుమాన్ మాలధారణ స్వీకరించిన భక్తులు

కందనూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన భక్తులు, యువత గురువారం ఉమామహేశ్వరంలో గురుస్వామి జయరాం ఆధ్వర్యంలో మండల హనుమాన్ దీక్షా మాలధారణ స్వీకరించారు. హనుమాన్ భక్తులు రాంబంటు సన్నిధిలో భక్తిశ్రద్ధలతో మండలం రోజులు హనుమంతునికి ప్రత్యేక దీక్షాతో పూజలు చేయనున్నట్లు గురుస్వామి ఎం.బాలస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి అయ్యప్పరెడ్డి, స్వాములు ప్రశాంత్, రాములు, వెంకటేశ్, శంకర్, వేణు ఇతర స్వాములు దీక్ష స్వీకరించారు.

ఘనంగా మహబూబ్ సుభాని గంధోత్సవం




యాపట్లలో దర్గా దగ్గర ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యాపట్ల గ్రామంలో గార్వీ మహబూబ్ సుభాని గంధోత్సవాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో గంధోత్సవాన్ని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా దగ్గరకు తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు నిరంజన్, సలావుద్దీన్, జహంగీర్, సాదిక్, పరువాన్, నిజాం, మునీర్, మజీద్, బషీర్, సలీం, మాసుమ్, ఆసిఫ్, ఖదీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ పరిశ్రమ పరిశీలన

బాలానగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి పంచాయతీ శివారులోని హరి ఓం ఐరన్ పరిశ్రమను తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యంతో పెద్దాయపల్లి, సేరిగూడ గ్రామాల భూములు సాగుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో పెద్దాయపల్లి శేరిగూడ గ్రామాలకు చెందిన రైతులు రాజిరెడ్డి, సత్తయ్యగౌడ్, శ్రీధర్‌రెడ్డిలతో పాటు మరి కొందరు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. అలాగే ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. ఈ మేరకు తహసీల్దార్ పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యకారక నీటిని నల్లని పదార్థాలను కాలుష్యం బారిన పడిన సాగు భూములను పరిశీలించారు. కాలుష్యానికి గురైన తమ భూములను రైతులు తహసీల్దార్‌కు చూయించారు. సమగ్ర విచారణ అనంతరం ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు.

రోడ్డుపైకి కొండచిలువ



మానవపాడుకు వచ్చే దారిలో కొండచిలువ

మానవపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని జాతీయ రహదారి-44 నుంచి మానవపాడు మండల కేంద్రానికి వచ్చే డబుల్ రోడ్డుపై ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో భారీ కొండచిలువ గురువారం రాత్రి కనిపించింది. దీన్ని చూసిన ప్రయాణికులు, గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. మూడు నెలల క్రితం అదేరోడ్డుపై సంచరించగా, మళ్లీ ఇప్పుడు కనిపించిందని అటువైపు వెళ్లే రైతులు తెలిపారు.

స్వర్ణాభరణ భూషితుడు..
కురుమూర్తి రాయుడు

» బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టం

» 26న అలంకార ఉత్సవం

చిన్నచింతకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి ఘట్టమైన అలంకారోత్సవం ఈనెల 26న ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి అధికారులు, పాలకవర్గం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. తొలి ఘట్టం నుంచే స్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ మరింత పెరిగి, జనసంద్రంగా మారే అవకాశం ఉంది.



స్వామి వారి శంఖు చక్రం



పళ్లెంలో ఉంచిన బంగారు ఆభరణాలు

స్వామి వారి ఆభరణాల ఊరేగింపు

ముక్కెర వంశపు రాజుల కాలం నాటి స్వామి వారి ఆభరణాలు ఆత్మకూరు ఎస్‌బీఐలో భద్రపరిచి ఉంచిన వాటిలో బంగారు కిరీటం, కోర మీసం, హస్తాలు, భుజకీర్తులు, శంకు, చక్రాలు, పచ్చలతో పొదగబడిన వివిధ రకాల హారాలు, వజ్ర, వైడూర్యాలతో కూడిన ముత్యాల హారాలు, బంగారు ములగజ్జలు ఇంకా భక్తులు సమర్పించిన వివిధ రకాల ఆభరణాలతో కూడిన పెట్టెను ఆనవాయితీగా లాకర్ నుంచి బయటికి తీసుకువస్తారు. గాడి వంశానికి చెందిన స్వర్ణకారులు స్వామి వారి ఆభరణాల పెట్టెను తలపై ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు మధ్య ఊరేగింపు ఆత్మకూరు పట్టణంలో పెద్ద ఎత్తున చేపడుతారు. దీంతో అడుగడుగునా పూల వర్షం కురిసే విధంగా భక్తులు పూలను చల్లుతారు. పరమేశ్వర స్వామి చెరువు కట్ట మీదుగా మదనాపురం మండలం కొత్తపల్లి, దుప్పల్లి గ్రామాలకు చేరుకుంటాయి. ఇక్కడ పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతారు. చాలా వరకు భక్తులు నెమలి కట్టలను చేతబట్టి, బంతిపూలను మెడలో వేసుకుంటారు. అమ్మపూర్ గ్రామానికి మధ్యాహ్నం స్వామి వారి ఆభరణాలు చేరుకుంటాయి. అక్కడ ముక్కెర వంశపు రాజు వంశానికి చెందిన శ్రీరాంభూపాల్ నివాసంలో దాదాపు రెండు గంటల పాటు ఆనవాయితీ ప్రకారం అర్చకులు ఆధ్వర్యంలో భక్తులు కూడా పెద్ద ఎత్తున వాటిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మాపూర్ గ్రామం గుండా ఆభరణాలు ఊరేగింపు జాతర మైదానానికి సాయంత్రం చేరుకుంటుంది. స్వామి వారి రాజగోపురం నుంచి మెట్ల దారి గుండా ఆభరణాలు కాంచన గుహలోని గర్భగుడి ఎదుట ఉంచుతారు. అక్కడ ఆభరణాలను ఒక్కొక్కటి తీసి, అధికారుల సమక్షంలో పరిశీలించి రాత్రికి అర్చకుల ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య స్వామి వారికి అలంకరిస్తారు. దీంతో స్వామి వారు సువర్ణ భూషితుడై బంగారు కాంతులతో దగదగలాడుతూ కాంచన గుహ మెరుస్తుంది.

హంస వాహన సేవలో స్వామి వారు

అమ్మాపూర్ సమీపంలో వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి గురువారం రాత్రి హంస వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపులో అడుగడుగునా గోవింద నామస్మరణతో కురుమూర్తి గిరిలు పులకించిపోయాయి.



హంసవాహన సేవలో ఊరేగుతున్న కురుమూర్తి రాయుడు

కురుమూర్తి జాతరకు 270 ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తి స్వామి జాతరకు 270 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొత్తకోట, పెబ్బేరు, దేవరకద్ర, ఆత్మకూర్ ఇతర ప్రాంతాల నుంచి బస్సులను నడుపు తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం దృష్ట్యా ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండబోతుందని, అసౌకర్యం కలగకుండా బస్టాండ్లలో, కురుమూర్తి దేవస్థానం వద్ద ప్రత్యేక శిబిరాలు, తాగునీటి వసతి, టెంట్లు, ప్రయాణికులకు సహకరించడానికి వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దేవరకద్ర: కురుమూర్తి జాతరకు దేవరకద్ర నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు నారయణపేట డీఎం లావణ్య తెలిపారు. గురువారం ఆమె దేవరకద్ర బస్టాండ్‌ను పరిశీలించారు. నారాయణపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులను వారం రోజుల పాటు నడుస్తాయని పేర్కొన్నారు.

అర్హులకు విత్తనాలు పంపిణీ చేయాలి

» జాతీయ రహదారిపై రైతులు, బీజేపీ నాయకుల రాస్తారోకో



చంద్రకల్ దగ్గర జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో అర్హులైన రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయకుండా అధికార పార్టీకి చెందిన వారికి అధికారులు పెద్దపీట వేస్తున్నారని పెద్దకొత్తపల్లి మండల బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పరశురామ్ ఆధ్వర్యంలో గురువారం రైతులతో కలిసి మండలంలోని చంద్రకల్ గ్రామంలో నాగర్‌కర్నూల్-కొల్లాపూర్ మధ్య 167కే జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో గంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నూనె విత్తనాల ఉత్పత్తిని పెంచాలని ఉద్దేశంతో వందశాతం సబ్సిడీతో అర్హులైన రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. కానీ ఇక్కడ పరిస్థితి వేరుగా ఉందని ఆరోపించారు. ఏఎస్ఐ బాలనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి విరమింపజేశారు. కార్యక్రమంలో జలాల్ శివుడు, బెల్లి తిరుమల్‌యాదవ్, భీమేష్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, నాగరాజు, జగన్, విజయ్, రైతులు పాల్గొన్నారు.

వంగూరు: మండలంలోని చౌదర్‌పల్లిలో గురువారం సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ రైతు కొందరి రైతుల పేరుతో వంద క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు తెచ్చుకొని తమ దుకాణంలో నిల్వ ఉంచడంతో రైతులు ఆందోళన చేపట్టారు. తమ రాజకీయ పలుకుబడితో సబ్సిడీ వేరుశనగ విత్తన బ్యాగులు నిల్వ ఉంచాడని రైతులు జంగయ్య, పరశురాములు, వెంకటయ్య, కాశీనాథం, నరేందర్ ఆరోపించారు. వెంటనే అధికారులు విచారణ చేసి బ్యాగులను రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

చదువుతోపాటు ప్రభుత్వ సేవలు తెలుసుకోవాలి

» జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు పోలీస్, ప్రభుత్వం అందిస్తున్న సేవలను తెలుసుకొని వినియోగించుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్ సందర్శనకు వచ్చిన ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులతో ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలై అవగాహన పెంచుకోవాలన్నారు. గతంలో సైబర్ నేరాలు, మహిళలపై ఈవ్‌టీజింగ్ జరిగేవి కాదని, కాలానుగుణంగా నేర ప్రవృత్తి మారుతుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతకాలంలో మహిళలు, విద్యార్థినులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వారి కోసం ప్రభుత్వం, పోలీస్‌శాఖ అందిస్తున్న షీటీం, భరోసా, సఖి సెంటర్ సేవలను తెలుసుకొని అత్యవసర సమయాల్లో డయల్ 100, 8712670312కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శంకర్, సీఐ టి. శ్రీను, ఎంఏఎల్‌డీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న అర్చకులు



సామూహిక హోమాలలో పాల్గొన్న భక్తులు

» మహబూబ్‌నగర్ పట్టణంలో విగ్రహాల ఊరేగింపు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కంఠమహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠపన పూజా కార్యక్రమాలు కనులపండువగా సాగాయి. నగరంలోని ఏనుగొండ దేవునిగుట్టపై కొత్తగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రారంభం సందర్భంగా ప్రాతఃకాలంలో సుప్రభాతసేవ, వేద పారాయణం, గణపతి పూజ, పుణ్యహవచనం, దీక్ష స్వీకారం, అఖండ దీప స్థాపన, సర్వతో భద్ర మండల దేవతల ఆవాహన పూజ, వాస్తుపూజ, గణపతిహోమం, ఆవాహిక పీఠదేవతల హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం దేవతా మూర్తుల విగ్రహాలను గ్రామోత్సవం, అష్టదిగ్బంధనం, జలదివాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను ఊరేగింపు చేపట్టారు. శుక్రవారం కౌండిన్య మహర్షి కంఠమహేశ్వర స్వామి, సురమాంబ దేవి, కల కోడిపుంజు దేవత, వనం ఎల్లమ్మ దేవత, వనం మైసమ్మ దేవత, పోతరాజు, శివలింగం, నంది, మహాగణపతి విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. సాయంత్రం ఏనుగొండ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బోనాల ఊరేగింపు నిర్వహిస్తుండగా, కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన జోగిని శ్యామల పాల్గొననున్నారు.

ఆబ్కారీ ఆదాయం రూ.165.72 కోట్లు

» 227 దుకాణాలకు 5,524 దరఖాస్తులు

» గతం కంటే 36శాతం తక్కువ

» ముగిసిన మద్యం దుకాణాలకు టెండర్లు



మహబూబ్‌నగర్‌లో దరఖాస్తులు దాఖలు చేస్తున్న వ్యాపారులు

జిల్లా	దరఖాస్తులు
మహబూబ్‌నగర్	1,634
నారాయణపేట	853
గద్వాల	774
వనపర్తి	757
నాగర్‌కర్నూల్	1596

మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలకు ఎట్టకేలకు టెండర్ల గడువు ముగిసింది. ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ప్రభుత్వం మరో ఐదు రోజుల గడువు పొడిగించింది. ఈ ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో 336 టెండర్లు అదనంగా వచ్చాయి. మొత్తంగా 227 మద్యం దుకాణాలకు 5,524 టెండర్లు దాఖలయ్యాయి. ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు కాగా టెండర్ల రూపంలో ప్రభుత్వానికి రూ.165.72 కోట్ల ఆదాయం సమకూరింది. 2023తో పోలిస్తే 36 శాతం దరఖాస్తులు తగ్గిపోయాయి. మద్యం టెండర్లను గతేడాదికన్నా పెంచాలని ఎక్సైజ్‌శాఖ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గతంలో టెండర్లు వేసిన వ్యాపారులు చాలామంది ఈసారి ముఖం చాటేయడంతో టెండర్ల ప్రక్రియ మందకొడిగా సాగింది. రియల్ ఎస్టేట్ ప్రభావం మద్యం టెండర్లపై తీవ్రంగా చూయించినట్లు స్పష్టమవుతోంది. దీనికితోడు ఏపీ వ్యాపారులు తెలంగాణ వైపు ఆసక్తి చూయించపోవడం కూడా టెండర్లు తగ్గడానికి కారణమైందని యంత్రాంగం భావిస్తోంది. టెండర్ల ప్రక్రియ ముగిసినందున ఈనెల 27న లక్కీడిప్ నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల కలెక్టరేట్ సముదాయాలలో కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీడిప్ ప్రక్రియను చేపట్టనున్నారు. అదృష్టం వరించిన వారికి దుకాణాలను కేటాయించనున్నారు. దుకాణాలు దక్కించుకున్నవారు దుకాణం లైసెన్స్ ఫీజులో 1/6వ వంతు చెల్లించాల్సి ఉంటుంది.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలు



మద్దూరులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

మద్దూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూరులో అండర్-17 ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో 12 మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో మొదటి బహుమతిని దామరగిద్ద జట్టు కైవసం చేసుకోగా, బాలుర విభాగంలో ధన్వాడ ప్రథమ బహుమతిని, అలాగే దామరగిద్ద ద్వితీయ బహుమతిని సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం సవిత, బాల్‌రాజ్, అనంతసేన, రామకృష్ణ, సాయినాథ్, రవికుమార్, రాజేశ్వరి, కృష్ణవేణి, రఘు, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో విచారిస్తున్న అధికారులు

ఉప్పునుంతల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అడిషనల్ డీఆర్‌డీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు చేపట్టిన 555 వివిధ పనులకు గాను రూ.5,11,93,259 ఖర్చుపై సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలను ఎస్ఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలర్ కృష్ణారావు, అరవింద్, జిల్లా విజిలెన్స్ అధికారులు నసీరుద్దీన్, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు, సామాజిక తనిఖీ ఎంపీడీవో మోహన్‌లాల్, ఎంపీవో వెంకటేశ్, ఏపీవో పర్వతాలు, ఈసీ కుర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ స్కూల్ టీచర్లకు ఐడీలు

» ఒక్కొక్క కార్డుకు రూ.75

» పీఎంశ్రీ పాఠశాలలకు నిధులు మంజూరు చేసిన సమగ్రశిక్ష

» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 పీఎంశ్రీ పాఠశాలలు

» 1,940 మంది ఉపాధ్యాయులు



కోటకొండలోని జడ్పీహెచ్ పీఎంశ్రీ స్కూల్

నారాయణపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పీఎంశ్రీ స్కూల్‌లలో పనిచేసే ఉపాధ్యాయులకు ఐడీ కార్డులు జారీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 2025-26 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ అక్టోబరు 9న జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందాయి. ఐడీ కార్డుల కోసం ఒక్కొక్క దానికి రూ.75 ప్రకారం పీఎంశ్రీ పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. దాంతో త్వరలో పీఎంశ్రీ స్కూల్ ఉపాధ్యాయులందరికీ ఐడీ కార్డులు అందనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 పీఎంశ్రీ స్కూళ్లకు గాను 1940 మంది ఉపాధ్యాయులు ఉండగా వారికి ఐడీ కార్డుల కోసం రూ.1,45,500 నిధులు మంజూరయ్యాయి.

జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	నిధులు
జోగుళాంబ గద్వాల	22	400	రూ.30,000
మహబూబ్‌నగర్	26	478	రూ. 35,850
నాగర్‌కర్నూల్	27	428	రూ. 32,100
నారాయణపేట	19	327	రూ. 24,525
వనపర్తి	21	307	రూ. 23,025
మొత్తం	134	1940	రూ.1,45,500

క్రైం కార్నర్

లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పద మృతి

కల్వకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఓ లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం తీగలపల్లి గ్రామానికి చెందిన గోపాల మల్లయ్య (45) భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో ఆయన గ్రామంలో కాకుండా ఇతర ప్రాంతాలల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కల్వకుర్తి పట్టణంలోని భారత్ లాడ్జికి బుధవారం రాత్రి వచ్చాడు. గురువారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి అన్న గోపాల లింగం మృతిపై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండవ ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

వడ్డేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీలోని శాంతినగర్‌కు చెందిన వరలక్ష్మి(36) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. 14 ఏళ్ల క్రితం కర్నూలు జిల్లా గూడూరు గ్రామానికి చెందిన రాజశేఖర్‌తో వివాహమైంది. ఏడాది క్రితం భర్తతో గొడవపడి శాంతినగర్‌లోని తన అన్న వద్ద నివాసం ఉంటుంది. వారం రోజుల నుంచి గుండెనొప్పి రావడంతో ఆస్పత్రికి వెళ్లి చూయించుకోగా డబ్బులు ఎక్కువ అవుతాయన్న ఉద్దేశంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అన్న మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూరాపూర్ పాఠశాలలో చోరీ

లింగాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని సూరాపూర్ ప్రభుత్వ పాఠశాలలో దొంగలు పడ్డ ఘటన గురువారం వెలుగు చూసింది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గది తాళాలు పగలగొట్టారు. వంట సామాగ్రి, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం పర్వతాలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు.

బాల్య వివాహంపై ఫిర్యాదు

కోడేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో బాల్య వివాహంపై గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. ఏదుల మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక మండల కేంద్రంలో తన తాతగారి ఇంటి వద్ద ఉండి చదువుకుంటుంది. ఆ అమ్మాయికి పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో ఈ నెల 2న వివాహం జరిపించారు. ఓ వ్యక్తి ఒకరు 1098కు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన అధికారులు బాలికను బాల రక్ష భవన్‌కు తరలించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరు చౌరస్తా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని అలంపూరు చౌరస్తాలో గురువారం పోలీసు సిబ్బంది రవి, ఖాదర్ తనిఖీ చేస్తుండగా ఓ లారీని పట్టుకున్నారు. అందులో ఇసుక ఉండటంతో డ్రైవర్‌ను విచారించేందుకు ప్రయత్నించగా అతడు పారిపోయాడు. అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

మైనింగ్ లారీకి జరిమానా

మూసాపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు ఆలయం వద్ద ఇటీవల మైనింగ్ బండరాళ్లను తరలిస్తున్న లారీని బీజేపీ నాయకులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ శేఖర్ ఆదేశాల మేరకు గురువారం మైనింగ్ శాఖ అధికారులు బండరాళ్ల లారీని పరిశీలించి రూ.70 వేల జరిమానా విధించగా, చలాన్ కట్టడంతో లారీని వదిలేశామని తహసీల్దార్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

» ఆరుగురిపై కేసు నమోదు



పోలీసుల దాడుల్లో పట్టుబడిన నగదు

మద్దూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నా రాయణపేట జిల్లా మద్దూర్ మండలంలో ని పెదిరిపాడ్ శివారు లో పేకాట స్థావరంపై గురువారం రాత్రి టా స్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించా రు. రూ.41 వేల నగ దు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వా ధీనం చేసుకున్నట్లు ఎ స్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అమాయకులే లక్ష్యం

» ఏటీఎం కార్డులు ఏమార్చి.. డబ్బులతో జల్సాలు



నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మహమ్మదాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కేంద్రాల వద్ద అమాయకులను ఆసరాగా చేసుకొని మోసగిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ పోలీసులు తెలిపారు. గురువారం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి నిందితుడిని విలేకరుల ఎదుట ఉంచి వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కావలి చెన్నయ్య జల్సాలకు అలవాటుపడి ఏటీఎం కేంద్రాల వద్ద అమాయకులను ఆసరా చేసుకుని సహాయం చేస్తున్నట్లు నటించేవాడు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న వేరే ఏటీఎం కార్డులను మార్చి ఇచ్చి అసలు కార్డు ద్వారా వారి డబ్బులను డ్రా చేసుకునేవాడు. ఈ క్రమంలో ఏప్రిల్ నెలలో మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో పని చేస్తున్న శంకరయ్య కార్డు మార్చి రూ.57,800, బొమ్మికుంటతండాకు చెందిన రవి కార్డు ద్వారా రూ.30వేలు, సెప్టెంబరు 8న లిగాయిపల్లితండాకు చెందిన వ్యక్తి కార్డు ద్వారా రూ.28,500 డ్రా చేశాడు. ఇతనిపై గతంలో మహబూబ్‌నగర్ టూటౌన్, కొడంగల్, కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు. అతని నుంచి ఒక బైక్, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

బాలిక అదృశ్యం

తిమ్మాజిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏళ్ల తరబడి నరకయాతన

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం
- కనీస మరమ్మతు చేపట్టాలంటున్న వాహనదారులు



వనపర్తి నుంచి పెద్దమందడి వెళ్లే మనిగిల్ల వద్ద గుంతలతో అధ్వానంగా మారిన రహదారి



జగత్‌పల్లి నుంచి మనిగిల్ల గ్రామానికి వెళ్లే దారి

వనపర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు, భారీ వాహనాల రాకపోకలకు జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయి. నెలలో పదుల సంఖ్యలో వాహనదారులు రోడ్లపై ఏర్పడిన గుంతలలో పడి మృత్యువాత పడడంతో పాటు గాయాల పాలవుతున్నారు. ఈ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

టెండర్లు పూర్తయినా..

వనపర్తి నుంచి పెద్దమందడి వెళ్లే రహదారి ఏళ్లుగా గుంతలమయంగా మారింది. జగత్‌పల్లి, మణిగిల్ల వద్ద గుంతలుగా ఏర్పడి నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని నెలల క్రితం తాత్కాలికంగా మరమ్మతు చేపట్టినా ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు మరమ్మతుకు రూ.40 కోట్లు మంజూరు కాగా ఇటీవలే టెండర్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. అదేవిధంగా వనపర్తి నుంచి పెబ్బేరు వెళ్లే రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవలే ఒక యువకుడు తిరుమలయ్య గుట్ట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి మృతి చెందాడు. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టడానికి అటవీ శాఖ అనుమతులు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ రోడ్డు విస్తరణకు అనుమతులు ఇచ్చినట్లు సంబంధిత అటవీశాఖ అధికారుల నుంచి సమాచారం. అదే విధంగా ఆత్మకూరు మండల కేంద్రం నుంచి మూలమల్ల గ్రామం మీదుగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలు గుంతలుగా ఏర్పడింది. 2016 కృష్ణా పుష్కరాల నిమిత్తం మంజూరైన రోడ్డు మరమ్మతు 11 కిలో మీటర్ల మేర రూ.8 కోట్ల 30 లక్షల తో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ప్రస్తుతం ఎక్స్‌కవేటర్ సహాయంతో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని తాత్కాలికంగా మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు చేపడుతున్నారు. అదేవిధంగా వనపర్తి నుంచి ఖిల్లాఘణపూర్ వెళ్లే ప్రధాన రహదారి కూడా అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో వందల సంఖ్యలో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన అవి కొన్ని రోజులకే గుంతలుగా ఏర్పడుతున్నాయి.

జిల్లాలో 85 కిలో మీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు

జిల్లా వ్యాప్తంగా 85 కిలో మీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ఈ రోడ్ల కనీస మరమ్మతుల కోసం రూ.66 లక్షల నిధులు మంజూరు అవసరమని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. అదే విధంగా దెబ్బతిన్న రోడ్లను పూర్తిస్థాయిలో కొత్త రోడ్లు వేయాలంటే రూ.9కోట్ల75 లక్షలు అవసరం పడుతుందన్నారు. ప్రతిపాదనలన్నింటిని కూడా ప్రభుత్వానికి పంపామని నిధులు మంజూరు అవ్వగానే రోడ్ల మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్త రోడ్ల నిర్మాణానికి చేపడతామని సంబంధిత పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

పెండింగ్‌లో కాజ్‌వే, బ్రిడ్జి పనులు

మదనాపూర్, పెద్దమందడి, శ్రీరంగాపూర్, వనపర్తి, వీపనగండ్ల మండలాల్లో కాజ్‌వే బ్రిడ్జిల నిర్మాణ పనులు కూడా చాలా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల మరమ్మతులతో పాటు పెండింగ్‌లో ఉన్న కాజ్‌వే బ్రిడ్జిల నిర్మాణ పనులను ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రోడ్ల మరమ్మతు కోసం నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం అక్రమ రవాణాకు కట్టడి

- వానాకాలం సీజన్ ప్రారంభం నేపథ్యంలో సరిహద్దులో నిఘా
- కర్ణాటక ధాన్యం రాకుండా చర్యలు
- నారాయణపేట జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు
- పోలీస్, రెవెన్యూ యంత్రాంగం తనిఖీ



కృష్ణ మండలంలోని చేగుంట చెక్‌పోస్టు వద్ద పోలీసుల పహారా

నారాయణపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ధాన్యం పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోని జిల్లాలోకి రాకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తుంది. దీంతో కర్ణాటక రాష్ట్రం నుంచి రాష్ట్రంలోని జిల్లా సరిహద్దులోకి ధాన్యం రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు గురువారం ఎస్పీ వినీత్ తెలిపారు. జిల్లా సరిహద్దులో నారాయణపేట మండలం జిలాల్‌పూర్, దామరగిద్ద మండలం కాన్‌కుర్తి, కృష్ణ బ్రిడ్జి వద్ద, కృష్ణ మండలం చేగుంట, ఉజ్జెల్లి, ఊట్కూర్ మండలం సమస్తపూర్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి ధాన్యం రాకుండా పటిష్ట నిఘా ఉంచనున్నారు.

ప్రతీ చెక్‌పోస్టు వద్ద ఇద్దరు పోలీసులు, ఒక రెవెన్యూ అధికారి తనిఖీ చేస్తున్నారు. అలాగే జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలించకుండా దృష్టి సారించారు. వాహనాలను తనిఖీ చేసి రిజిస్టర్‌లో నెంబర్లు, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాయనే వివరాలు పొందుపరుస్తున్నారు. అయితే రవాణా శాఖకు సంబంధించి జిల్లాలోని కృష్ణ బ్రిడ్జి వద్ద ఉన్న చెక్‌పోస్టును ఎత్తివేశారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షల మంది విద్యార్థులు



మహబూబ్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు సమ్మేటివ్ అసిస్మెంట్ పరీక్షలు-1 (ఎస్‌ఏ) ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 2025-26 ఏడాదికి గాను ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, కేజీబీవీ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తప్పని సరిగా డీసీఈబీ ద్వారా రూపొందించిన ప్రశ్నాపత్రాలనే వినియోగించాలనే నిబంధన అమలులో ఉంది. ప్రైవేట్ పాఠశాలలో 1 నుంచి 5 తరగతి వరకు సొంత ప్రశ్నపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్న విషయంపై అధికారులు పలుమార్లు హెచ్చరించిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నవంబరు 3న ఫలితాలు వెల్లడించి, 4వ తేదీన ఆన్‌లైన్‌లో నివేదించి, 15న తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,557 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3.50లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రానున్నారు. ఇప్పటికే డీసీఈబీలు తయారు చేసిన పరీక్ష పత్రాలను కాంప్లెక్స్ పాఠశాలకు నుంచి పాఠశాలకు తీసుకెళ్లారు. ప్రైవేట్ పాఠశాలలో కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీసీఈబీ పరీక్ష పత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ అన్ని చర్యలు చేపట్టింది.

డీసీఈబీ ప్రశ్నపత్రాలే వాడాలి

విద్యాశాఖ సూచించిన ప్రకారం అన్ని పాఠశాలల్లో తప్పని సరిగా డీసీఈబీ రూపొందించిన ప్రశ్నపత్రాలు తప్పని సరిగా వాడాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. విద్యాశాఖ సూచించిన సమయానుసారం పరీక్షలు నిర్వహించాలి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించాం.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

- టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం

ఆత్మకూరు/ అమరచింత, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో కలిసి భవన నిర్మాణ కార్మికుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు సహజ మరణం ప్రమాద బీమా, వివాహ, ప్రసవం వంటి సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదన్నారు. దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్న ఇప్పటికీ నిధులు లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలో జమ కావడం లేదన్నారు. తక్షణమే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ సకాలంలో సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా పాలక ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, సాంబశివుడు, హనుమంతు, రాజు, కిరణ్, ప్రసాద్, రాము, నరసింహ పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు బాలమణి

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్నా నేటికీ ఆ హామీ నెరవేర్చలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్‌లు మండిపడ్డారు.

గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా మహాసభలు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బాలమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరై, మాట్లాడారు. కేంద్రం పెంచిన పారితోషికాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా యధావిధిగా అమలు చేయాలన్నారు. సభ ప్రారంభ సూచికంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం ఇటీవల మరణించిన ఆశా కార్యకర్తలకు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి కాశప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నరహరి, పవన్, ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ సైనికులకు సన్మానం



సైనికులను సన్మానిస్తున్న తోటి సైనికులు

వెల్దండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పోరాడి తొలిసారిగా స్వగ్రామానికి వచ్చిన సైనికులకు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన ద్యాప విజయ్‌కుమార్, మట్ట విజేందర్‌గౌడ్ సెలవుపై వెల్దండకు వచ్చారు. గ్రామం నుంచి ఎంతోమంది సైన్యంలో పనిచేయడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మట్ట చంద్రశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తమాచారి, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, శరత్‌గౌడ్, శ్రీనివాసులు, గణేశ్, విష్ణుగౌడ్, ప్రసాద్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు ఈ నెల 28, 29, 30 వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు రాఘవచారి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ 50 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. మహాసభలకు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీ.హరగోపాల్ ముఖ్యఅతిథిగా, వక్తలుగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాసిం, హైకోర్టు అడ్వకేట్ కుర్రా జితేంద్రబాబు, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, సాంబశివరావు, ప్రశాంత్, విజయ్, వెంకట్, శివ, వివేక్, అఖిలేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

● చెన్నయ్య, ఎంపీడీవో, గట్టు



గట్టు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మండల అభివృద్ధి అధికారి చెన్నయ్య అన్నారు. అలాగే ఇతర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో చెప్పారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా?

ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకాలు అందుతున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎలా సాగుతున్నాయి?

ఇళ్ల నిర్మాణాలు వేగంగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించాం. బేస్‌మెంట్ లెవల్ నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు చెల్లింపులు చేస్తున్నాము. ఇందిరమ్మ ఇళ్లపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం.

గ్రామ కార్యదర్శుల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి?

మండలంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను నిత్యం పర్యవేక్షిస్తుంటాను. మెడికల్ లీవ్‌లో ఉన్న కార్యదర్శుల గ్రామాలకు ఇన్‌చార్జీలను కేటాయించాము.

మిషన్ భగీరథ నీరు సరిగా అందుతున్నదా?

గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై పర్యవేక్షణ చేస్తున్నాం. సమస్య ఉన్న గ్రామాల్లో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాం.

న్యూస్ బాక్స్

బాల్యవివాహాలతో అనర్థాలు

అయిజ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు అనర్థాలకు దారి తీస్తాయని మండల విద్యాధికారి రాములు, హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉత్తనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీటిని ప్రోత్సహించడం చట్టరీత్యా నేరం అని చెప్పారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేశ్, ఎస్ఐ తరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'పోస్టాఫీస్ సేవలపై తెలియజేయాలి'

మానవపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే సేవలపై తెలియజేయాలని ఎస్‌పీఎం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పోస్టుమాస్టర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మానవపాడు పోస్టుమాస్టర్ రామనాథరెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ సమస్యలపై దృష్టి సారించాలి



గ్రామ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో రాఘవ

మానవపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలకు గ్రామ కార్యదర్శులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రాఘవ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్య, చెత్త, రోడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి ఉండాలని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణంలో జాప్యంచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, మహేశ్, నాగరాజు, మేరీ, మంజుల ఉన్నారు.

ఎస్ఏ-1 పరీక్షలకు హాజరయ్యేలా చూడాలి

● ఎంఈవో రవీంద్రబాబు

ధరూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్ఏ-1 పరీక్షలకు ప్రతీ విద్యార్థి హాజరయ్యేలా చూడాలని ఎంఈవో రవీంద్రబాబు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ధరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడిన ఎంఈవో, నిర్ణీత సమయంలో సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో వందశాతం పరీక్షలు రాసేలా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అలాగే కురువవీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమస్యలు తెలుసుకున్నారు.

ఇబ్రహీం, అనుచరులను కఠినంగా శిక్షించాలి : బీజేపీ

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోరక్షకుడు ప్రశాంత్‌సింగ్‌ను విచక్షణా రహితంగా కాల్చిన ఇబ్రహీం, అనుచరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బండల వెంకట్రాములు, రజక జయశ్రీ, రవికుమార్ ఎగ్బోటే ఉన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరణ

● అధికారులతో సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్ ● రైతులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ఏఈవోలదే



ఇటిక్యాల పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం.సంతోష్

గద్వాలన్యూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తమ పొలాల వద్ద ధాన్యాన్ని సరిగ్గా ఆరబెట్టుకొని కేంద్రాలకు తీసుకువచ్చేలా సంబంధిత వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో ఏఈవోలదే పూర్తి బాధ్యత అని చెప్పారు. ఆయాకేంద్రాల వద్ద గన్నీబ్యాగులు, టార్పాలిన్‌లు, తూకం యంత్రాలు, ప్యాడీక్లీనర్లు, తేమ నిర్ధారణ యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు అన్ని రేపటి వరకు(శనివారం) పూర్తి చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరిధాన్యం సేకరణ జరగాలని సూచించారు. ఆయా మండాలాల్లో రైతుల నుంచి కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం తీసుకువచ్చే అవకాశం ఉందో పూర్తి వివరాలు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు లారీల ద్వారా తరలించే విధంగా, అలాగే గోదాములలో నిల్వ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గత సీజన్‌లో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఈ సారి ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకొని అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీఎస్‌వో స్వామికుమార్, మేనేజర్ విమల, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయఅధికారి జగ్గునాయక్, కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసులు, అధికారులు ఉన్నారు.

● పత్తికి మద్దతు ధర రూ.8,110

పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు స్లాట్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. గురువారం ఐడీవోసీలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు, పత్తి సేకరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కనీస మద్దతు ధరకు సోమవారం నుంచి పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేయాలని చెప్పారు. రైతులు తమ ఫోన్‌లో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వే సమయంలో రైతులు ఇచ్చిన ఫోన్ నెంబర్లు ప్రస్తుతం మారితే అప్‌డేట్ చేసుకునేలా ఏఈవోలు సహకరించాలన్నారు. గద్వాలలో రెండు, అలంపూర్‌లో ఒకటి చొప్పున జిల్లాలో మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 2.24 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి, కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. కనీస మద్దతు ధర క్వింటా రూ.8,110 చెల్లించాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, డీఎస్పీ మొగులయ్య, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి జగ్గునాయక్, ఏడీఏ సంగీతలక్ష్మి, అధికారులు ఉన్నారు.

● ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

ఇటిక్యాల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బీఎం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఇటిక్యాల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు నాణ్యమైన, సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. ప్రసవాల సంఖ్యను వందశాతం పెంచాలని, సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని ఆదేశించారు. అంబులెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ల్యాబ్ రిపోర్టులు సమయానికి అందజేయాలన్నారు. గర్భిణులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూభారతి రికార్డులను ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వహించాలని చెప్పారు. కార్యాలయంలో తహసీల్దార్ వీరభద్రప్ప, డాక్టర్ అనిరుధ్, రెవెన్యూ, వైద్యసిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదువుకోవాలి

● పెద్దొడ్డి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



పెద్దొడ్డి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

మల్దకల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామ ప్రభుత్వ పాఠశాలను గురువారం అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని మంచిగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలని సూచించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, అడిషనల్ ప్రోగ్రాం అధికారి సుజాత, గ్రామ కార్యదర్శి రాజు, పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకటయ్య, చక్రధర్, నాగరాజు ఉన్నారు.

● జాబ్‌కార్డుదారుల కేవైసీ పూర్తి చేయాలి

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతీఒక్కరి కేవైసీని మూడు రోజుల్లో పూర్తి చేయాలని డీఆర్‌డీవో నర్సింగరావు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం పెద్దొడ్డిలో పనుల జాతర కార్యక్రమంలో చేపట్టిన పనులను పర్యవేక్షించారు. పశువుల పాకను పరిశీలించి, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. పనులను మార్చి వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. 2025-26 సంవత్సరానికి గ్రామ సభలను పూర్తి చేయాలని సూచించారు. లేబర్ బడ్జెట్‌లో ఇంకా పూర్తికాని 36,892 పని దినాలను మార్చి వరకు పూర్తి చేయడానికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో సుజాత, ఈసీ నాగరాజు,టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్ పాల్గొన్నారు.

మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు రాబట్టాలి



శెట్టిఆత్మకూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఆకుకూరల తోటను పరిశీలిస్తున్న డీఈవో విజయలక్ష్మి

● డీఈవో విజయలక్ష్మి

గద్వాల సర్కిల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యార్థులకు మెరుగైన బోధన చేసి ఉత్తమ ఫలితాలు రాబట్టాలని డీఈవో విజయలక్ష్మి సూచించారు. గద్వాల మండలం శెట్టిఆత్మకూర్‌లోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల, గద్వాల బుర్దపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. శెట్టిఆత్మకూర్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక తరగతుల నిర్వహణపై జీహెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశమై పలుసలహాలు, సూచనలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలోని ఆకు కూరల తోటను పరిశీలించారు. అనుకూలంగా పాఠశాలలో తప్పనిసరిగా కిచెన్ గార్డెన్‌ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ హంపయ్య, పాఠశాల జీహెచ్ ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

● బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఘట్కేసర్‌లో గోరక్షక్ ప్రశాంత్‌పై బుల్లెట్ దాడి చేయటం అత్యంత దుర్మార్గమైన చర్య అని జిల్లా బీజేపి మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం అయిజలోని పార్టి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశ సంస్కృతి, గోమాత రక్షణ కోసం నిస్వార్థంగా సేవ చేస్తున్న గోరక్షకులపై దాడులు చేయటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. గోవు భారత సంస్కృతిలో తల్లి సమానమన్నారు. వాటిని రక్షించటం భారతీయుల ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. అలాంటివారిపై దాడి చేయడమంటే భారతీయులకు ఆందోళన కలిగించే చర్య అని తెలిపారు. ఇలాంటి దాడులో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నాయని తెలిపారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, గోరక్షక దళం వంటి సంస్థలు నిస్వార్థ సేవను అందిస్తున్నాయన్నారు. బుల్లెట్ దాడికి పాల్పడిన ఎంఐఎం గుండాలను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశ వ్యాప్త ఆందోళనకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, లక్ష్మణ్‌గౌడు, నాగరాజు, అంజి, ఋషి, కృష్ణ, రఘు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల వద్ద చెట్లకొమ్మల తొలగింపు

● ఏడీఈ రమేశ్



నదీఅగ్రహారం వద్ద చెట్లకొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

గద్వాలఅర్బన్,అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరాలో భాగంగా విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని ఏడీఈ రమేష్ తెలిపారు. పనుల్లో విద్యుత్ అంతరాయం కారణంగా ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గురువారం పట్టణ శివారు నదీఅగ్రహారం వద్ద విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులను ఏడీఈ పరిశీలించారు. అనంతరం మాట్లాడిన ఏడీఈ, పట్టణంలోని పలువార్డుల పరిధిలోని కాలనీలు, శివారు ప్రాంతాల్లో చెట్లకొమ్మల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు మార్చడం, ఎర్త్ సరిచేయడం తదితర పనులను ముమ్మరం చేశామని తెలిపారు. ఈ పనుల వల్ల కొన్ని సందర్భాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఇందుకు విద్యుత్ వినియోగదారులు, రైతులు, వ్యాపారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

42శాతం రిజర్వేషన్ అమలుకు ఉద్యమించాలి

● గద్వాల బీసీ జేఏసీ నాయకులు

గద్వాల అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం ఉద్యమించాలని జిల్లా బీసీ జేఏసీ నాయకుడు మధుసూదన్‌బాబు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విస్తృత సమావేశానికి జిల్లాకు చెందిన బీసీ జేఏసీ నాయకులు హాజరై మాట్లాడారు. బీసీలు రాజ్యాధికారంలోకి రావాలంటే ఐకమత్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అగ్రవర్ణ పార్టీలు వారి అవసరాల కోసం లేవనెత్తిన 42శాతం రిజర్వేషన్ అమలయ్యే దాకా పోరాడాలన్నారు. సమావేశంలో బీసీ జేఏసీ అతిక్‌ఉర్ రెహమాన్, ఈశ్వర్, ప్రవీణ్, హేమంత్ ఉన్నారు.

27 నుంచి పత్తి కొనుగోళ్లు

● నేడు పోస్టర్ విడుదల

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్ల ప్రారంభించనున్నట్లు అలంపూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ ఎల్లస్వామి తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు నేడు శుక్రవారం వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో పూజలు చేసి, పోస్టర్ విడుదల చేస్తామని తెలిపారు. సీసీఐలో పత్తి విక్రయించే రైతులు ముందుగానే కేంద్రం విడుదల చేసిన యాప్‌లో, స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. 8శాతం నుంచి 12 శాతంలోపు తేమశాతం ఉండాలని తెలిపారు. మద్దతు ధర బీబీ మోడ్ పింజరకం క్వింటాలుకు రూ.8110లు, బీబీ ఎస్పీఎల్ పింజరకం క్వింటాలుకు రూ.8060లుగా నిర్ణయించినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

● ఉత్సాహంగా పాల్గొన్న పాఠశాల విద్యార్థులు



పోలీసుల ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న అదనపు ఎస్పీ కె.శంకర్

గద్వాలక్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే వివిధ ఆయుధాలు, అత్యవసర సమయంలో ఉపయోగించే పనిముట్ల గురించి అదనపు ఎస్పీ కె.శంకర్ వివరించారు.

బాంబులను కనుక్కోవడం, దొంగల వేలిముద్రలను గుర్తించడం, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాలను కనుగొనే జాగిలాల పనితీరును, షీటీం, భరోసా, ట్రాఫిక్, సైబర్ నేరాల నియంత్రణ విభాగాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, ఆర్ఐ వెంకటేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఫీల్డ్ విజిట్‌కు తరలిన విద్యార్థులు



ఫీల్డ్ విజిట్‌కు బయలుదేరి వెళుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

గద్వాలఅర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఫిజికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా గురువారం పోలీస్ శాఖ నిర్వహించిన వివిధ రకాల స్టాల్స్‌ను ఫీల్డ్ విజిట్‌లో భాగంగా పట్టణంలోని ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా తెలిపారు.

కార్యక్రమంలో ఏ క్యూఏసీ కోఆర్డినేటర్ రాధిక, ఫిజికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ సత్యన్న, డాక్టర్ సత్తెమ్మ, కృష్ణయ్య, ఆర్ట్స్ విభాగం నుంచి జిటి పద్మ, పవన్‌కుమార్, నరేష్‌బాబు, హరిబాబు, రమేశ్, పరశురాం, ధర్మతేజ, రమాదేవి, విద్యార్థులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

● టీజీపీఏ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్‌బాబు

గద్వాల అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ (టీజీపీఏ) అధ్యక్షుడు అబ్దుల్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం పట్టణంలోని స్మృతివనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీపీఎఫ్, జీఐఎస్, గ్రాట్యూవిటీ, ఈఎల్, మెడికల్ బిల్లులు, పీఆర్‌సీ బకాయిలు, ఇతర అరియర్స్ బిల్లుకు సంబంధించి ఆర్థిక ప్రయోజనాలు ఇంతవరకు అందలేదన్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 8,972 మంది ఉద్యోగులకు సంబంధించిన రూ.13వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని ఇంతవరకు చెల్లించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల్లో ప్రతి నెలా రూ.700 కోట్లు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. నేటి వరకు బకాయిలు విడుదల చేయకుండా రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున జిల్లాలోని రెగ్యులర్ పెన్షనర్లు అందరూ ఈనెల 27 సోమవారం ఉదయం 10 గంటలకు టీజీపీసీ అసోసియేషన్ కార్యాలయం వద్దకు రావాలని కోరారు. అనంతరం దయం 10.30 గంటలకు పట్టణంలోని ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్, సుభాన్, రమేష్‌బాబు ఉన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు తేదీ ఖరారు

● ఈనెల 30 నుంచి వచ్చే నెల 13 వరకు అవకాశం

గద్వాల సర్కిల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు తేదీని రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు ఖరారు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి నవంబరు 13 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబరు 29వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని తెలిపారు.

టీకాలు వేయించి పశు సంపదను కాపాడుకోవాలి

● మండల పశు వైద్యాధికారి స్వరూప

వడ్డేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముందస్తుగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు సంపదను కాపాడుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ స్వరూప రైతులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం శాంతినగర్ పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. శిబిరంలో తెల్లపశువులు, ఆవులు, ఎద్దులు, కోడెలు 73, గేదెలు, దూడలు 362, మొత్తం 435 పశువులకు టీకాలు వేశామని పశువైద్యసిబ్బంది తెలిపారు. శిబిరాన్ని పర్యవేక్షించిన పశువైద్యాధికారి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వచ్చిన పశువుల్లో నోటిలో, గిట్ట మధ్యలో పుండు కావడం, చొంగ కారటం, మేత తినకపోవడం, జ్వరం ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధిసోకి పశు సంపదను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించాలని రైతులకు సూచించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ

మానవపాడు/ఇటిక్యాల/అయిజ,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే బాలికలకు వచ్చే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లకు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రాఘవ, సీడీపీవో సుజాత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతమ్మ, ఏపీఎం సునంద, సీసీ రవికుమార్, ఆంజనేయుడు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఇటిక్యాల: బాలికలు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎం సలోమి అన్నారు. గురువారం ఇటిక్యాల రైతువేదికలో స్నేహసంస్థ అధ్యక్షతన ఐసీడీఎస్, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, ఐఎఫ్ఏ మాత్రలు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌విజయమ్మ, పరమేశ్వరి, ఆశాలు, ఏఎన్ఎంలు ఉన్నారు.

● అయిజ : బాలికల సంరక్షణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఏపీఎం జయాకర్ సూచించారు. గురువారం అయిజలోని వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి సమన్వయ కమిటీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో హేమలత, మోడల్ ప్రాజెక్టు ఇన్‌చార్జి పవన్‌కుమార్, సీసీలు సుదర్శన్, అకౌంటెంట్ స్వర్ణలత పాల్గొన్నారు.